క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన

జియ్యమ్మవలస రూరల్: మండల పరిధిలోని పెదమేరంగి కూడలిలో తిరుమల సాయి పాఠశాల నుంచి జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైన విద్యార్థులను అదే స్కూల్‌లో మంగళవారం అభినందించారు. ఇదే కార్యక్రమానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరై, బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆర్.సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆదివాసీ దినోత్సవంపై ముందస్తు సమావేశం

సీతంపేట: ఈ నెల 9న నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి సంబంధించి ముందస్తు సమావేశం గిరిజన సంఘాలతో బుధవారం నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరగనుందని హాజరు కావాలని కోరారు.

ముమ్మరంగా వరి ఉభాలు



వెంకటరాజపురంలో వరినాట్లు వేయడంలో నిమగ్నమైన కూలీలు

జియ్యమ్మవలస: మండల వ్యాప్తంగా వరి ఉభాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో సాగుకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో వరినాట్లు వేసే పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పొలాల్లోనే పనుల్లో నిమగ్నమవుతున్నారు.

పసుపుకొమ్ములతో శ్యామలాంబకు అలంకరణ

సాలూరు: పట్టణంలోని శ్యామలాంబ తల్లిని శ్రావణ మంగళవారం పసుపుకొమ్ములతో ప్రత్యేక అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

కొనసాగుతున్న నిరసన దీక్షలు

పార్వతీపురం: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో వైద్యసిబ్బందిని నియమించాలని కోరుతూ చేస్తున్న నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట 8వ రోజు గిరిజన సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన దీక్షలను చేపట్టారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించేంతవరకు తమ దీక్షలను కొనసాగిస్తామని గిరిజన సంఘం నాయకులు స్పష్టం చేస్తున్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమసంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్, గిరిజన సంఘం నాయకులు పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, తాడంగి సాయిబాబు, గౌరీశ్వరి, గణేష్, సుజాత, పార్వతీశం తదితరులు పాల్గొన్నారు.

పొలం గట్లపై కంది మొక్కలు వేసుకోవాలి

సీతానగరం: మండలంలో వరి ఉభాలు జరిగిన పొలం గట్లపై కంది పంట సాగు చేయడం వల్ల రైతులకు అధిక ఆదాయం వస్తుందని ఏఓ ఎస్. అవినాష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా కాశీపేట గ్రామంలో వరినాట్లు వేయడం పూర్తి చేసిన రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరినాట్లు వేసిన పొలం గట్లచుట్టూ కంది మొక్కలు వేయడం వల్ల పంటకు రక్షణగా ఉంటుందని, ఫలసాయం వస్తుందన్నారు. కంది విత్తనాలు రైతు సేవాకేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదు

సాలూరు: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోల రికార్డులను తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించిన 8 మంది ఆటోవాలాలకు జరిమానా విధించారు.

ఉచిత బస్సు పేరుతో ఆటో కార్మికుల పొట్ట కొట్టొద్దు

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తోందని, దీనివల్ల లక్షలాదిమంది ఆటో కార్మికుల ఉపాధి పోతుందని ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం పాత బస్టాండ్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్ల కోసం అనాలోచిత పథకాలు అమలు చేసి కొంతమందికి మేలు చేస్తున్నప్పటికీ మరి కొంతమందికి తీవ్ర నష్టం చేకూర్చే హామీలు ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కూటమి మోసాలపై నిలదీయాలి



దళాయివలసలో కూటమి మోసాలను వివరిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ నాయకులు

గరుగుబిల్లి: ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై నిలదీయాలని జెడ్పీ వైస్ చైర్మన్, మండల కన్వీనర్‌లు మరిశర్ల బాపూజీనాయుడు, కేతిరెడ్డి అచ్యుతరావులు పిలుపునిచ్చారు. మండలంలోని దళాయివలస, చినగుడబ, వల్లరగుడబ గ్రామాల్లో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఇంటింటికీ వెళ్లి, ఏడాది కాలంగా ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకుండా సీఎం చంద్రబాబు అండ్ కో ప్రజలను మోసగిస్తున్న వైనాన్ని తెలియజేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో పాల్గొని, కూటమి పాలనపై మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజాసంక్షేమం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తుంటే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందన్న కూటమి నాయకులు ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలకు రెండింతలు ఎక్కువ ఇస్తామని ఎలా హామీ ఇచ్చారని నిలదీశారు. మీరిస్తానంటే రాష్ట్రం శ్రీలంక అవ్వదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇంకా ఎందుకు ఎన్నికల హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారన్నారు.



చినగుడబలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లతో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

–తెస్తున్న అప్పులేం చేస్తున్నారు?

ఏడాదిలోనే రూ.లక్ష కోట్లకు పైగా అప్పులను కూటమి ప్రభుత్వం చేసిందని, ఆ డబ్బులతో ప్రజలకు ఏం చేశారని, ఏ పథకాలు ఇచ్చారని ధ్వజమెత్తారు. అమరావతి అభివృద్ధి చేస్తానని గద్దెనెక్కారని, ఇంతవరకు ఏం అభివృద్ధి చేశారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు ఏ కష్టం రాకుండా చూసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మేనిఫెస్టోలోని హామీలన్నీ అమలు చేశారన్నారు. ప్రస్తుతం జనమే అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు తేడాను గమనిస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని లేకుంటే వారే రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హితవుపలికారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బత్తల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బి.గౌరమ్మ, నాయకులు జి.రమాకుమారి, టి.ఎల్లంనాయుడు, డి. మాధవనాయుడు, ఎం.గౌరునాయుడు, బి.సింహాచలంనాయుడు, బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస రూరల్: బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జోగులడమ్మ, అలమండ గ్రామ పంచాయతీల్లో మంగళవారం పర్యటించిన వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి, కూటమి మోసాలను వివరించారు. అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు లోలుక నారాయణరావు పాల్గొన్నారు.



వల్లరగుడబలో ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని తెలియజేస్తున్న మండల కన్వీనర్ అచ్యుతరావు



జియ్యమ్మవలస రూరల్: ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మెరుగైన వైద్యం అందించండి

కొమరాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహా చినఖేర్జిల ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ కేవీఎస్ పద్మావతి మంగళవారం సందర్శించారు. ఓపీ నమోదు, రికార్డులు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యం అందించాలని, గర్భిణుల నమోదు సక్రమంగా చేపట్టాలని తెలిపారు. అలాగే అబా ఐడీ క్రియేట్ చేయాలని, సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడే పిల్లలను గుర్తించి, చికిత్స అందజేయాలన్నారు. ఆమె వెంట వైద్యాధికారి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కొమరాడ పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారిణి పద్మావతి

మహాసభలను విజయవంతం చేయండి



కరపత్రాలతో సీపీఐ నాయకులు, కార్యకర్తలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పాలకొండలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య పిలుపునిచ్చారు. కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామంలో మంగళవారం జరిగిన వారపు సంతలో మహాసభల గూర్చి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేసి, మహాసభల గూర్చి తెలిపారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని మతోన్మాదం నుంచి కాపాడుకోవడానికి, రైతు, కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించడానికి, రైతు పండించే అన్ని పంటలకు మద్దతు ధర దొరికేలా చట్టం చేయాలని, ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలని, రూ.600 కనీస వేతనం ఇవ్వాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్న ప్రధాన డిమాండ్‌లతో ఆగస్టు 8, 9వ తేదీల్లో పాలకొండలో సభలు ఉంటాయన్నారు. ఈ సభలకు ప్రజలంతా వచ్చి మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు పువ్వల ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొత్స మోహన్‌రావు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాన్ని సందర్శించిన డీపీవో

సీతంపేట: సీతంపేట గ్రామ సచివాలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి కె.కొండలరావు మంగళవారం సందర్శించారు. సిబ్బంది హాజరు, రికార్డులు పరిశీలించారు. మండలంలో ఇంటిపన్ను 95 శాతం వసూలైందన్నారు. స్వర్ణ పంచాయతీకి సంబంధించిన వివరాలన్నీ అప్‌డేషన్ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ, పారిశుధ్యం వివరాలు గూర్చి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె.సత్యం, గ్రామ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన

గుమ్మలక్ష్మీపురం: పెండింగ్‌లోని రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు బిడ్డిక అనిల్, ఎస్ఎఫ్ఐ గుమ్మలక్ష్మీపురం మండల కార్యదర్శి ఆరిక గంగారావులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు విద్యార్థులతో కలిసి ఎల్విన్‌పేటలో మంగళవారం మానవహారం చేపట్టి, ఆందోళనకు దిగారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆఫ్‌లైన్ ద్వారా డిగ్రీ అడ్మిషన్లు వెంటనే ప్రారంభించాలని, సింగిల్ సబ్జెక్టు స్థానంలో డ్యూయల్ మేజరు సెబ్జెక్టు విధానం తీసుకురావాలని, పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం కేంద్రాల్లో పీజీ సెంటర్లు ఈ విద్యా సంవత్సరం నుంచే ఆరంభించాలని, సాలూరు పీజీ సెంటర్‌లో ఏరోనాటికల్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు చేర్చాలని, జీవో నంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి, ఆర్ఐ బి.శివకు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి కె.డేవిడ్, మండల కమిటీ సభ్యులు శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ధర్నా..

పాలకొండ: విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి టి.అఖిల్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంటు నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు. వీటిని నిలిపివేయడంతో విద్యార్థులు మధ్యలోనే చదువును ఆపేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొండ ప్రాంతంలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. వసతిగృహాలను గాలికొదిలేశారని, అందులో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యా రంగ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. విద్యార్థి సంఘ నాయకులు అభి, రాజేష్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీలు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి, సామాజిక తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎస్ఆర్‌పీలు, డీఆర్‌పీలు, సోషల్ ఆడిట్ బృందంతో ఆమె మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు సిద్ధం చేసి తనిఖీ బృందానికి అప్పగించాలని తెలిపారు. 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు గ్రామాల్లో చేసిన రూ. 20.7 కోట్ల విలువైన పనుల రికార్డులు, పనులను పరిశీలించడం జరుగుతుందన్నారు. అలాగే సామాజిక పింఛన్లను కూడా సరిచూడడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌సీ ఈదుబిల్లి పున్నపునాయుడు, ఏపీవో గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లినిక్‌ల్లో ఆకస్మిక తనిఖీలు



క్లినిక్ లైసెన్స్ తనిఖీ చేస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లలో అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉప తహసీల్దారు సురేష్, వైద్యురాలు ప్రజ్ఞ, ఎస్ఐ పి.నారాయణరావులు తమ బృందంతో కలిసి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఎనిమిది క్లినిక్‌లకు వెళ్లి, అక్కడి రికార్డులు, వాటి లైసెన్స్‌లు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. లైసెన్స్ లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, లైసెన్స్ కలిగిన క్లినిక్ వద్ద మాత్రమే ప్రాథమిక చికిత్స చేయించుకోవాలని వారు ప్రజలకు సూచించారు.

అసలైన రైతులకు భూములు చెందాలనే రీసర్వే

సీతానగరం: అసలైన రైతుల భూముల పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేసిన రీసర్వే సమగ్రంగా నిర్వహించి భూముల సమస్యలను పరిష్కరించనున్నట్లు రాష్ట్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ (సీఎల్ఆర్) అదనపు డైరెక్టర్ రోణంకి గోవిందరావు అన్నారు. ఈ మేరకు సీతానగరం మండలంలో రీసర్వేనిమిత్తం ప్రకటించిన పైలెట్ గ్రామంగా ఎంపిక చేసిన లచ్చయ్యపేటలో గ్రామసభ సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ ఆధ్వర్యంలోమంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సీఎల్ఆర్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూ, సర్వే సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించే రీసర్వే సందర్భంగా పురస్కరించుకుని భూములకు సమస్యలు న్యాయా? లేదో రైతులు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో పాలకొండ సబ్‌కలెక్టర్ సి యశ్వంత్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ప్రసన్నకుమార్, హెచ్‌డీటీ ఉమామహేశ్వరరావు, సీఎస్‌డీటీ రమేష్‌నాయుడు, ఆర్ఐ శ్రీనివాసరావు, సర్పంచ్ వి.సన్యాశినాయుడు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

సరస్వతి శిశుమందిర్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు

సాలూరు రూరల్: సరస్వతి విద్యాపీఠం విజయవాడ సమితి విజయనగరం విభాగ్ స్థాయి ఆటల పోటీలు సాలూరు మండలం మామిడిపల్లిలోని సరస్వతీ శిశుమందిరం పాఠశాల కేంద్రంగా మంగళవారం నిర్వహించారు. ఈ పోటీలలో నెల్లిమర్ల, మామిడిపల్లి, సాలూరు, బొబ్బిలి విద్యార్థులు పాల్గొన్నారు.

- తవ్వేశారు.. వదిలేశారు...



పాలకొండ నగర పంచాయతీ పరిధి మురళీ మోహననగర్ వద్ద నెల రోజుల కిందట నీటి పారుదల శాఖ అధికారులు రోడ్డును తవ్వేసి వదిలేశారు. తోటపల్లి ఎడమ కాలువకు సంబంధించిన పిల్ల కాలువ పూడిక తొలగింపులో భాగంగా రోడ్డు తొలగించి పూడికలు తీశారు. ఇంత వరకు బాగానే ఉన్నా అనంతరం కల్వర్టు నిర్మించలేదు. కల్వర్ట్ పూర్తి చేసి రహదారి నిర్మాణం చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు జాడ లేకుండా పోయారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు కాలనీలకు చెందిన ప్రజలకు అవసరమయ్యే ఈ రహదారి లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

– పాలకొండ

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి

గరుగుబిల్లి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు వండిపెట్టాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించి, విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి చూసి పరిశీలించారు. ప్రతి వంటకం రుచి, శుచి కలిగి ఉండాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారి ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలని తెలిపారు.



విద్యార్థుల భోజనాలు పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

నిబంధనలు పాటించాలి

పాలకొండ రూరల్: పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటాయని ఆర్టీవో టి.వేణుగోపాల్ అన్నారు. పాలకొండ–సీతంపేట ప్రధాన రహదారిలో మంగళవారం వాహన తనిఖీలు చేశారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలు, స్కూల్ బస్సులు, ఇతర వాహనాలను గుర్తించి కేసులను నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహన యజమానులకు రూ.13వేలు అపరాధ రుసుం విధించారు. ఎనిమిది కేసులు నమోదు చేసినట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.



వాహన తనిఖీలు చేస్తున్న ఆర్టీవో

గృహ నమోదులో తేడాలపై పరిశీలన

భామిని: మండలంలోని కొరమ గ్రామంలో ఇళ్ల కొలతల నమోదులో వచ్చిన తేడాలను జిల్లా పంచాయతీ అధికారి కె.కొండలరావు, డీఎల్‌పీవో జయంతిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలన చేపట్టారు. ఇంటి కొలతల నమోదులో భారీగా తేడాలు రావడంతో మరోసారి ఇంటి కొలతలు తీసి లెక్కించారు. ఇప్పటికే భామిని మండలంలో 46 గృహాలను వెయ్యి చదరపు అడుగులు నమోదైనట్టు అధికారులు గుర్తించారు. వీటిలో 36 గృహాల లెక్కింపులో తేడాలు రావడం గమనార్హం. వారితో డిప్యూటీ ఎంపీడీవో అమరాన జగన్నాథం, కార్యదర్శి కె.బాలాకుమారి, ఇంజినీరింగ్ సహాయకుడు సన్యాసిరావు ఉన్నారు.



కొరమలో ఇంటి కొలతలు పరిశీలిస్తున్న డీపీవో, డీఎల్‌పీవో

డ్వాక్రా సంఘాల నిధులు కాజేసేందుకు కుట్ర

- మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: డ్వాక్రా సంఘాల నిధులు కాజేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని వండువలో విలేకర్లతో ఆమె మంగళవారం మాట్లాడారు. డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీ రుణాలు ఇచ్చి వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాల్సిన ప్రభుత్వం వారి బ్యాంకు ఖాతాలో ఉన్న నిధులపై కన్నేసిందని ఆరోపించారు. గ్రామ సంఘాల అధ్యక్షులతో బలవంతంగా తీర్మానాలు చేయించి వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి టీడీపీ ప్రభుత్వం పసుపు–కుంకుమ పేరుతో డ్వాక్రా అక్కచెల్లమ్మల నోట్లో మట్టికొట్టారని, నేడు వారి బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బును బలవంతంగా రాష్ట్ర ఖజానాకు మళ్లించి కాజేసేందుకు చూడడం చాలా దారుణమన్నారు. డ్వాక్రా మహిళలను లక్షాధికారులను చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు వారిని బిచ్చగాళ్లుగా మార్చేందుకు పన్నాగాలు పన్నుతున్నారని దుయ్యబట్టారు.

టవర్ ఉన్నా సిగ్నల్ శూన్యం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని వలసబల్లేరు గ్రామంలో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ టవర్ నుంచి నెట్‌వర్క్ సేవలు అందకపోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా నెట్‌వర్క్ పనిచేయడం లేదని, ఎవరికి ఫోన్ చేసినా కనెక్ట్ అవ్వడం లేదని, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ నుంచి ఎక్కడికి అయినా ఎవరి నుంచి ఎవరికైనా సమాచారం చేరవేయడం, తెలుసుకోవడం లాంటి వాటి కోసం మొబైల్ వినియోగం తప్పనిసరి అని, ఈ నేపథ్యంలో నెట్‌వర్క్ సరిగా లేకుంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. తాము రీచార్జ్ చేసుకున్న మొత్తం వృథా అవుతోందని వాపోతున్నారు. చాలామంది జియో, ఎయిర్‌టెల్ వంటి ప్రైవేట్ నెట్‌వర్క్‌లకు మారుతున్నారని, ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలు పునరుద్ధరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వలసబల్లేరులో పనిచేయని బీఎస్ఎన్ఎల్ టవర్

- ఘటాల ఊరేగింపు



వీరఘట్టం మండలంలో మంగళవారం వారాల పండగలు ఘనంగా నిర్వహించారు. వీరఘట్టం మేజరు పంచాయతీలో కొత్త బస్టాండ్, ఖస్పావీధి, బార్నాలవీధి, గెంబలివీధుల్లోని కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన వారు వారాల పండగను నిర్వహించారు. మహిళలు ఘటాలను ప్రధాన రహదారి గుండా మేళతాళాలతో, దేవతా మూర్తులు, బ్రహ్మరాక్షసుల వేషధారణలతో ఊరేగింపు చేపట్టారు. గాసీ వీధి సమీపంలో ఉన్న ఉల్లిచెరువు వద్ద వనంలో ఉన్న అమ్మవారి గుడి వద్ద మొక్కులు తీర్చుకున్నారు.

– వీరఘట్టం